

లాస్య అంతియయాత్రలో ఎమ్మెల్యేలు హరీష్‌రావు, కౌశిక్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పల్లారాజేశ్వర్ రెడ్డి

చిన్న వయసులోనే ఎమ్మెల్యే.. అంతలోనే మృత్యు ఒడికి..

ఎమ్మెల్యే లాస్యకు కన్నీటి వీడ్కోలు

రసూల్‌పురా: చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య నందిత శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ప్రజాదరణ ఉన్న ఆమెను అకస్మాత్తుగా మృత్యువు కబళించడంతో కంటోన్మెంట్ నియోజకవర్గమంతా శోకసంద్రంలో మునిగిపోయింది.

◆ ఎమ్మెల్యే లాస్యనందితను మృత్యువు వెంటాడిందని లాస్య భౌతిక కాయాన్ని సందర్శించేందుకు వచ్చిన పలువురు నేతలు పేర్కొన్నారు. బోయిన్‌పల్లి వీఆర్ హాస్పిటల్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన లాస్య లిఫ్ట్‌లో ఇరుక్కున్నారు. లిఫ్ట్ తలుపులు పగులగొట్టి బయటికి తీశారు. తర్వాత కొన్ని రోజులకు తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో పది రోజుల పాటు చికిత్స పొంది ఆరోగ్యంతో తిరిగి వచ్చారు. ఆ తర్వాత ఇటీవల నల్గొండలో జరిగిన బహిరంగ సభ నుంచి తిరిగి వస్తుండగా కారు ప్రమాదానికి గురై తృటిలో ప్రాణాప్రాయం నుంచి తప్పించుకున్నారు. కాగా చివరిగా శుక్రవారం ఉదయం ఓఆర్‌ఆర్ పై జరిగిన కారు ప్రమాదంలో మృత్యు ఒడికి చేరారని నేతలు, నాయకులు కంటతడి పెట్టారు.

ప్రముఖుల సంతాపం..

ఎమ్మెల్యే లాస్యనందిత మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు నళిని కిరణ్, అనితా ప్రభాకర్, లోక్‌నాథ్, శ్యామ్‌కుమార్, భాగ్యశ్రీ, మార్కెట్ మాజీ చైర్మన్ ఖదీరవన్, మాజీ చైర్మన్లు మన్నే క్రిషాంక్, గజ్జెల నాగేష్, ఎర్రోళ్ళ శ్రీనివాస్ పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు లాస్య కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు.

సనత్‌నగర్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి దిగ్భ్రాంతికి గురి చేసిందని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. పిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు సేవలందిస్తున్న లాస్య నందిత మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని వేడుకుంటున్నట్లు తెలిపారు. శశిధర్‌రెడ్డి వెంట బీజేపీ నాయకులు ప్రవీణ్‌గౌడ్, వికాస్ తదితరులు ఉన్నారు.



లాస్య సోదరి నివేదితను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలసాని



నివాళులర్పిస్తున్న బండా కార్తీకరెడ్డి



గాంధీ ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యేలు హరీష్‌రావు, తలసాని



లాస్యనందితకు నివాళి అర్పిస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి



లాస్య నందిత మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న డిప్యూటీ మేయర్



లాస్య అంతియయాత్రకు హాజరైన జనం

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 28, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 45, కీర 21, దోసకాయ 21, బీట్‌రూట్ 20, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 21, చామగడ్డ 50, మొరంగడ్డ 18, కందగడ్డ 58, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

'ఓయూ నిర్మాణాలలో వీసీ వాటాపై విచారణ చేపట్టాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు, భవనాలలో వీసీ ప్రొ.రవీందర్ వాటాపై విచారణ చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అలివేలి రాజు డిమాండ్ చేశారు. సెంటినరి పాలన భవనం, పైలాన్, ఇంజినీరింగ్ విద్యార్థులకు హాస్టల్ భవనం, బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో వీసీకి 20 శాతం వాట ఉందని రాజు ఆరోపించారు. తొలుత మూడు అంతస్తుల పాలన భవనం నిర్మాణానికి అంచనా వేసి రెండు అంతస్తులకు కుదించారని పేర్కొన్నారు. పైలాన్ నిర్మాణానికి రూ.77 లక్షల అంచనా వేసి రూ.1.58 కోట్లకు పెంచారని వివరించారు. నాణ్యత లేని నిర్మాణ పనులకు కోట్ల రూపాయాలు వెచ్చించారని, ఓయూలో జరుగుతున్న నిర్మాణం పనులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి

సనత్‌నగర్: నియోజకవర్గంలో ఈ నెల 26న జరిగే బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రవీందర్, రాష్ట్ర నాయకులు దయానంద్, హృషీకేశ్, మూల రవీందర్, లక్ష్మీనారాయణ, చంద్రకుమార్, ఫణికుమార్, నరేష్, రజనీష్ పాల్గొని వివరాలు వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఎల్లమ్మ టెంపుల్, 60 ఫీట్ల రోడ్డు, స్వామి టాకీస్ సర్కిల్, కూరగాయల మార్కెట్, బీజేపీ చౌక్ మీదుగా కొనసాగుతుందన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

రాంగోపాల్‌పేట్: క్రైస్తవులపై దాడులను అరికట్టాలని క్రైస్తవ సంఘాల నాయకులు సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని కలిసి కోరారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ భరత్‌రెడ్డి, జాన్ కెనెడి, భారత క్రిస్టియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ముల్కల భాస్కర్ తదితరులు కలిసి క్రైస్తవ సమస్యల గురించి చర్చించారు. జన్వాడ గ్రామంలో చర్చి ముందు రోడ్డు విషయంలో కొంత మంది చర్చిలోకి వెళ్లి ధ్వంసం చేయడంతో పాటు క్రైస్తవులపై దాడి చేశారని చెప్పారు. అమాయక క్రైస్తవులపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించారన్నారు. కందుకూరు మండలంలో ఇద్దరు పాస్టర్లను అమానుషంగా కొట్టారని ఇటీవల జరుగుతున్న ఇలాంటి దాడులను అరికట్టాలని కోరారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా బలమైన చట్టాలు తీసుకుని రావాలని వారు కోరారు. అలాగే ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని కూడా కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవ దండోరా నాయకులు కాశీ సతీష్, పీటర్, ముల్కల భాస్కర్ సరోజ, ఎస్తేరు రాణి పాస్టర్లు పాల్గొన్నారు.

మేడారం చేరుకున్న విద్యార్థి నేతల పాదయాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎంగా రేవంత్ రెడ్డి పదేళ్లు పాలించాలని ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థుల చేట్టిప పాదయాత్ర శుక్రవారం మేడారానికి చేరుకుంది. మంత్రి సీతక్క సమక్షంలో సమ్మక్క-సారలమ్మలకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నట్లు కృష్ణ తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క ఓరుగంటి కృష్ణతో పాటు ఓయూ విద్యార్థి నేతలను సన్మానించారు.



ఓరుగంటి కృష్ణను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

అసలేమైంది?

వాహనాన్ని ఢీ కొట్టిందా.. రెయిలింగ్‌కు గుద్దుకుందా?



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: కంటోన్మెంట్ ఎమ్మెల్యే జ్ఞానలాస్య నందిత కారు ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై పోలీసులు ఇంకా ఓ నిర్ధారణకు రాలేక పోతున్నారు. నందిత ప్రయాణిస్తున్న కారు గుర్తు తెలియని వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీ కొట్టిందా..? లేదా అతి వేగం కారణంగా రోడ్డు పక్కను ఉన్న రెయిలింగ్‌కు గుద్దుకుందా? అనేదానిపై ఇంకా పూర్తి స్థాయిలో నిర్ధారణకు రాలేక పోతున్నారని సమాచారం. ఈ రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు ఇప్పటికే కారు నడుపుతున్న ఎమ్మెల్యే పీఏ ఆకాష్ వద్ద వాంగ్మూలాన్ని రికార్డు చేస్తూ వీడియో కూడా తీశారు. ప్రమాదం జరిగినప్పుడు కండ్లు చీకట్లు అలుముకున్నాయని ఆకాష్ తన పేర్కొన్నట్లు సమాచారం.

వాహనంపై రోబోసాండ్ రేణువులు..

ప్రమాదానికి గురైన వీరి వాహనం ఎస్ఎల్-6 కారుపై రోబోసాండ్ రేణువులు పడి ఉండటాన్ని బట్టి ఈ వాహనం టిప్పర్‌ను ఢీకొట్టిందనే ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఓఆర్‌ఆర్‌పై ఉన్న టోల్‌గేట్ల వద్ద ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తే.. ఆ సమయంలో సుమారు 15 నుంచి 20 వరకు టిప్పర్లు లాంటి భారీ వాహనాలు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అలా కాకుండా వీరి వాహనం సుమారు గంటకు వంద కిలోమీటర్ల వేగంతో వెళుతూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌కు గుద్దుకుందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన చోట టిప్పర్ లాక్కెళ్లినట్లు గుర్తులు ఏమైనా ఉన్నాయా? అని పరిశీలించారు.

- ఇంకా నిర్ధారణకు రాని పోలీసులు
- ప్రమాదం జరిగిన తీరుపై సమగ్ర దర్యాప్తు
- ఐదు శాఖల నిపుణులతో ప్రత్యేక బృందం
- ఆకాష్ వాంగ్మూలాన్ని రికార్డు చేసిన పోలీసులు
- కండ్లకు చీకట్లు కమ్ముకోవడంతో ప్రమాదం జరిగిందని చెప్పినట్లు సమాచారం.?
- ఓఆర్‌ఆర్‌పై సీసీటీవీ ఫుటేజీల సేకరణ

మరణించిన వారు ఎమ్మెల్యే కావడంతో..

ఈ రోడ్డు ప్రమాదంలో మరణించిన వారు ఎమ్మెల్యే కావడంతో ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కేసు దర్యాప్తును అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నారు. ఈ రోడ్డు ప్రమాదానికి గల కారణా లను తేల్చేందుకు పోలీసులు ఐదు శాఖలతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులతో పాటు, మోటార్‌వెహికిల్ (ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్), సివిల్ ఇంజనీర్ (ఓఆర్‌ఆర్ ఇంజనీరింగ్ విభాగం), క్లూస్‌టీం, ఫోరెన్సిక్ డాక్టర్లు.. ఇలా ఐదు కీలక శాఖల నిపుణులతో ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. ఆయా శాఖల నిపుణులు ఒకటీ రెండు రోజుల్లో నివేదిక ఇవ్వ నున్నట్లు సమాచారం.

వాహనాన్ని పరిశీలించిన బృందం

ప్రమాదానికి గురైన వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన నిపుణుల బృందం ఎమ్మెల్యే లాస్యనందిత సీటు బెల్టు పెట్టుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. బెల్టు పెట్టుకుంటేనే బెలూన్‌లు ఓపెన్ అయ్యాయని చెబుతున్నారు. బెలూన్‌లు ఓపెన్ అయ్యాక కూడా లాస్య తీవ్ర స్థాయిలో గాయాల పాలవడం.. ఏకంగా మృత్యువాత పడటం ఎలా జరిగిందనే కోణంలో కూడా ఈ నిపుణుల బృందం దర్యాప్తు చేస్తోంది. వీరి వాహనం కొత్తది కావడంతో ఫిట్‌నెస్ లోపాలు కూడా ఉండవనే నిర్ధారణకు వచ్చారు.

మలుపులు లేని రోడ్డు..

ఇంజనీరింగ్ విభాగం నిపుణులు ఔటర్‌రింగ్ రోడ్డుపై ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అయితే ఈ ప్రమాదం జరిగిన చోట ఎలాంటి మలుపులు కూడా లేవని నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రమాదం జరిగిన ప్రదేశంలో ఎక్కడైనా సీసీటీవీ ఫుటేజీ దొరుకుతుందేమోనని పరిశీలించారు.

విద్యుత్ సమస్యలపై సత్వరమే స్పందించాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- సమీక్ష సమావేశంలో గ్రీన్‌ల్యాండ్స్ డీఈ సుధీర్‌కుమార్

అంతరాయం ఏర్పడితే.. సంప్రదించాల్సిన నంబర్లు..

డీఈ గ్రీన్‌ల్యాండ్స్ సుధీర్‌కుమార్-9491067488
ఏడీఈ గ్రీన్‌ల్యాండ్స్ కిషోర్‌కుమార్-9440812841
ఏడీఈ సనత్‌నగర్ అమర్నాథ్-9440812842
ఏడీఈ సీబీడీ గ్రీన్‌ల్యాండ్స్ చరణ్‌సింగ్-9440812852
ఏఈ గ్రీన్‌ల్యాండ్స్ నందన్-9440812874
ఏఈ ఎస్ఆర్‌నగర్ మురళీధర్-9440812866
ఏఈ సనత్‌నగర్ శేఖర్-9440812861
ఏఈ ఎర్రగడ్డ రంజన్-9440812869
ఏఈ మోతీనగర్ వేణు-9440812867
గ్రీన్‌ల్యాండ్స్ ఫ్యూజ్ ఆఫ్ కాల్
9490619712/ 040-23431069
బేగంపేట ఫ్యూజ్ ఆఫ్ కాల్
9490619716/ 040-23433306
ఎస్ఆర్‌నగర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్
9490619714/ 040-23431156
సనత్‌నగర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్
9490619718/ 040-23431149
ఎర్రగడ్డ ఫ్యూజ్ ఆఫ్ కాల్
8333923726/ 040-23431392
మోతీనగర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్
8333923726/040-23431391



విద్యుత్ అధికారులు, సిబ్బందితో చర్చిస్తున్న డీఈ సుధీర్

సనత్‌నగర్: విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు అందిన వెంటనే సకాలంలో స్పందించి సమస్యలను పరిష్కరించాలని గ్రీన్‌ల్యాండ్స్ డీఈ సుధీర్‌కుమార్ ఆదేశించారు. డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు లో ఓల్టేజీ సమస్యలు, అదనపు విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు, ట్రాన్స్‌పార్మర్ల సామర్థ్యం పెంచడం, కొత్త లైన్ల ఏర్పాటు తదితర వాటిపై శుక్రవారం బేగంపేట సెక్షన్ (ఓల్డ్ ఎయిర్‌పోర్ట్)లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులతో పాటు సిబ్బంది పర్యవేక్షణ నిరంతరాయంగా కొనసాగాలని, ఏమాత్రం అలసత్వం వహించరాదన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సకాలంలో స్పందించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఈ వేసవికాలం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు, తగిన ప్రణాళికలు రూపొందించుకుని 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరాలో లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఏఈలు, విద్యుత్ సిబ్బందిపై ఉందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఫిర్యాదు అందిన వెంటనే స్పందించాలన్నారు. ఈ సమీక్షలో సనత్‌నగర్ ఏడీఈ అమర్నాథ్, సెంట్రల్ బ్రేక్ డౌన్ (సీబీడీ) ఏడీఈ చరణ్‌సింగ్, గ్రీన్‌ల్యాండ్స్ ఏఈ నందన్, బేగంపేట ఏఈ మధుసూదన్, ఎస్ఆర్‌నగర్ ఏఈ మురళీధర్, సనత్‌నగర్ ఏఈ శేఖర్, ఎర్రగడ్డ ఏఈ రంజాన్, మోతీనగర్ ఏఈ వేణు, బోరబండ ఏఈ సాయితేజ, సీబీడీ ఏఈలు శ్రీనివాస్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

స్పందించి ఉంటే.. బతికేదేమో?

పటాన్‌చెరు: ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు అందిఉంటే ఎమ్మెల్యే లాస్య నందిత బ్రతికేదేమోనని విశ్లేషిస్తున్నారు. ఔటర్ పై ప్రమాదం జరిగినప్పుడు ఆ సమాచారం సిబ్బందికి చేరేటప్పటికీ చాలా సమయం పడుతుంది. వాయువేగంతో వెళ్లే ప్రయాణికులెవరూ ప్రమాదంలో గాయపడ్డవారికి సాయం చేసే పరిస్థితి ఆ రోడ్డుపై ఉండటం లేదు. వేగంగా వెళ్లే వారు ఏదో జరిగిందని చూసీచూడనట్లు వెళ్లిపోవడం సహజం. లాస్య నందిత ప్రమాదం జరిగిన వెంటనే చనిపోయి ఉండదనే వాదన ఉంది. త్వరగా ఆసుపత్రిలో చేర్చి ఉంటే బతికి ఉండేదని చర్చించుకుంటున్నారు. ఆమె వాహనం ఉదయం శామీర్‌పేట వద్ద ఉదయం 5.11 గంటలకు ఓఆర్‌ఆర్‌పై కి చేరిందని తెలుస్తుంది. అయితే ప్రమాద స్థలికి చేరుకునే సరికి దాదాపు 20 నిమిషాల్లోపే పడుతుంది. ఆమె ప్రయాణించిన వాహనం గంటకు వంద కిలోమీటర్ల కంటే వేగంగా వెళ్తుందని అంచనా వేస్తే 5.30 గంటలకల్లా ప్రమాదం జరిగి ఆమె కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుంటుంది. అయితే సమాచారం పోలీసులకు అంది ఆమెను ఆసుపత్రికి తెచ్చే లోపు గంటకు పైగా సమయం పట్టింది. ఔటర్‌పై ప్రమాదాలు జరిగితే మరింత వేగవంతంగా సమాచారం అందేలా చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ఔటర్ పెట్రోలింగ్ వాహనాలున్నప్పటికీ ప్రమాదంపై సమాచార త్వరగా చేరే వ్యవస్థ లేదు. దీంతో ప్రమాద బాధితులకు వెంటనే సహాయక చర్యలు అందడం లేదు.

నేటి నుంచి ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవాలు

అడ్డగుట్ట: అడ్డగుట్ట సీ-సెక్షన్‌లోని కమ్యూనిటీహాల్ వెనుకనున్న గుట్టపై ఇటీవల నిర్మాణం జరిగిన మార్కండేయ సహిత శివ పంచాయతన విగ్రహ, శిఖర ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రఘు స్వామి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లు చేశామన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

రాంగోపాల్‌పేట్: ప్రింటింగ్ మిషన్ ఆవిష్కర్త గుటన్‌బర్గ్ జయంతి సందర్భంగా ఈ నెల 24వ తేదీన మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రింటర్స్ డే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చైర్మన్ జలంధర్‌గౌడ్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగగా కళాసీగూడలోని కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

నేడు చండీహోమం

సనత్‌నగర్: మాఘ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం శ్రీదుర్గామాత ఆలయంలో శనివారం ఉదయం 8 గంటలకు చండీ హోమం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఉదయం 10 గంటలకు దత్త హోమం జరుగుతుందన్నారు.

4 నుంచి డెయిరీ ఇండస్ట్రీ సదస్సు

పంజగుట్ట: ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్‌జోన్ ఆధ్వర్యంలో మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో '50వ డెయిరీ ఇండస్ట్రీ కాన్ఫరెన్స్' నిర్వహించనున్నట్లు ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్ జోన్ చైర్మన్ సతీష్ కులకర్ణి తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాన్ఫరెన్స్ కరపత్రాన్ని అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ సి.హెచ్.రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ డాక్టర్ కె.ఆర్.రావు, సభ్యులు బి.వి.కె.రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పాడిపరిశ్రమ అభివృద్ధికి ఈ కాన్ఫరెన్స్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు.



కుంకుమార్చన.. ప్రత్యేకాలంకరణ



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో జరుగుతున్న సామూహిక కుంకుమార్చనలో భాగంగా శుక్రవారం అమ్మవారిని రంగురంగుల గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా జరిగిన కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని లలిత సహస్ర నామ పారాయణంతో పాటు కుంకుమార్చన పూజలు చేశారు. రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈ కార్యకమంలో చైర్మన్ రామేశ్వర్, ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. -రాంగోపాల్‌పేట్